వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల పల్లకీని ఊరేగిస్తున్న పూస రాజు, పూస శ్రీకృష్ణ

ముషీరాబాద్: పూస స్వామి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు పూస రాజు ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్ జెమినికాలనీలో శివపార్వతుల కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, పిరెళ్ల చంద్రశేఖర్ జీ, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, పావనీవినయ్ కుమార్, కే రవిచారి, బీజేపీ సీనియర్ నాయకులు పాపారావు, వీరేశ్, దయానంద్‌గుప్తా, రిటైర్డు జిల్లా జడ్జి ఎస్.మాల్యాద్రి, మెగా సంజయ్‌గుప్తా, చికోటి ప్రవీణ్‌కుమార్ తదితరులు హాజరై శివపార్వతులకు పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీని రాంనగర్ వీధుల్లో ఊరేగించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ సహజం

చిక్కడపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ సహజమని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ జాన్‌బాబు అన్నారు. రాష్ట్ర డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్‌గా రిటైర్డ్ అయిన జీడీ నాయుడును రాష్ట్ర కుష్టు నివారణ అధికారుల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో సత్కరించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై నాయుడు దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ జీడీ నాయుడు అధికారిగానే కాకుండా ప్రఖ్యాత రంగస్థల కళాకారుడిగా ఎంతో పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అలాగే తోటి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనురాధ, విశ్రాంత ఫిజియోథెరపిస్టు జీ విశ్వనాథం, విశ్రాంత డైటీషియన్ అధికారి ఎస్. రాజమౌళి, ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకురాలు యలమంచిలి ధనలక్ష్మి రాజేందర్, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రహదారులే పార్కింగ్ స్థలాలు!

అంతర్గత కాలనీల్లో యథేచ్ఛగా పార్కింగ్

- ఇరువైపులా వాహనాల నిలిపివేత
- కుచించుకుపోతున్న రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సైదాబాద్ కాలనీలో ఇరువైపులా ..



హౌజింగ్ బోర్డ్ కాలనీలో ఇరువైపులా నిలిపిన వాహనాలు

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లో ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డంతా కుంచించుకుపోవడంతో పాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా కాలనీలవాసులు వాపోతున్నారు. అసలే ఇరుకుగా ఉండే కాలనీల్లోని రహదారులపై కొందరు పదుల సంఖ్యల్లో వాహనాలను నిలుపుతుండటంతో ఎంతో మందికి ఇబ్బందులకు గురిచేస్తోంది. సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో నిత్యం అక్రమ పార్కింగ్‌తో సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని సమయాల్లో వాహనదారులు నడుమ వాగ్వాదాలతో పాటు పరస్పరదాడులకు సైతం చేసుకున్న ఘటనలు ఉన్నాయి.

ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్

సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలకు చెందిన వారు ప్రధాన రహదారులపైకి చేరుకునేందుకు వెళ్లే మార్గాల్లోని అంతర్గత రహదారులపై ఇరువైపులా తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండటం సమస్యలకు కారణమవుతుంది. సాధారణంగా అంతర్గత రహదారులు చిన్నవిగా ఉంటాయి. వాటిపై రెండు వైపులా కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు.దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అక్రమ పార్కింగ్‌తో ఒక వాహనం నిలిచిపోతే వెనుక వచ్చే మరిన్ని వాహనాలు స్తంభించి హారన్‌లతో హోరెత్తిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల వాహనాలు, ఆటోలు, తమ వాహనాలపై వెళ్లే ఉద్యోగులు అంతర్గత కాలనీల్లో అక్రమ పార్కింగ్‌లతో నరకం అనుభవిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత కాలనీల్లో పలు వ్యాపారాలు నిర్వహించే దుకాణాదారులు తమ షాపుల ముందు వినియోగదారులు వాహనాలను నిలుపకుండా దృష్టి పెట్టాలి. ఒకే చోట ఇరువైపులా వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడటానికి అవకాశం ఉంటుంది. దుకాణాదారులు తమ షాపుల ముందు నో పార్కింగ్ సైన్ బోర్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలంటున్నారు.

ట్రాఫిక్ పోలీసుల నిఘా లేక..

ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడైనా కాలనీల్లోని అంతర్గత రహదారులపై దృష్టి పెట్టాలి. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతున్న కాలనీల్లోని రహదారులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలపై జరిమానాలు విధించాలని స్థానికులు కోరుతున్నారు. ఇలా చేస్తే మరోసారి వాహనాలను పార్కింగ్ చేయరని అభిప్రాయపడుతున్నారు. సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలవాసులు తమ ప్రాంతాలలో అక్రమ పార్కింగ్ విషయమై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఆయా కాలనీల్లోని అక్రమ పార్కింగ్‌పై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టాలి..



కాలనీల్లోని అంతర్గత రహదారులు గతంలో ఎంతో ప్రశాంతంగా ఉండేవి. ఇటీవల ఆయా రహదారులపై అక్రమ పార్కింగ్ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అత్యవసర పనులకు వెళ్లే వారు అక్రమ పార్కింగ్‌ల కారణంగా సమయానికి వెళ్లలేక వేదనకు గురవుతున్నారు. వాహనదారులు తమ వాహనాలను ఇష్టారాజ్యంగా రహదారులపై నిలిపి ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. ఈ సమస్యపై స్థానిక ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– లక్ష్మణ్ ఠాకూర్–సైదాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి వద్ద..

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి గేటు ముందు ఆటోల అడ్డగోలు పార్కింగ్‌లతో ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి గేటు సమీపంలో ఓ టీ కొట్టును ఏర్పాటు చేయడం, అలాగే ఆ రోడ్డులో అడ్డగోలుగా ఆటోలను పార్కింగ్ చేస్తుండడంతో అక్కడికొచ్చే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శనివారం ఆసుపత్రికి వచ్చిన ఓ వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో అందులో ఉన్న గర్భిణి గాయపడింది. ట్రాఫిక్ పోలీసులు, ఆసుపత్రి సమీపంలో అక్రమ పార్కింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే టీ కొట్లు, తోపుడు బండ్లను అక్కడి నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.



ఆసుపత్రి వద్ద నిలిపిన వాహనాలు

నేడు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బైక్ ర్యాలీ

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు డిసెంబర్ 1న ఆదివారం ఉదయం 10:30 గంటలకు కాచిగూడలోని శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానిక హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై అధికారుల కొరడా



శివం రోడ్డు బతుకమ్మకుంటలో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

అంబర్‌పేట: ఫుట్‌పాట్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ అధికారులు శనివారం కొరడా ఝులిపించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ –16 డీఎంసీ మారుతీదివాకర్, ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ నేతృత్వంలో శివం రోడ్డులోని బతుకమ్మకుంట, తిలక్‌నగర్ ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను తొలగించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం సమగ్ర సర్వే



సర్వేలో పాల్గొన్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు కుమారస్వామి

కాచిగూడ: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. కాచిగూడలో సర్వే తీరును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో కులగణన చేపట్టడం ఆనందంగా ఉందని, దీనిద్వారా ప్రజల ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో చాలామంది తమ వివరాలను ఎన్యూమరేటర్లకు చెప్పడం లేదని, ప్రతిఒక్కరూ సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జే.నర్సయ్య

అంబర్‌పేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జే నర్సయ్య సూచించారు. బచపన్ గ్రూప్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో డీడీ కాలనీలోని పాఠశాల ఆవరణలో 'ఉడాన్ 2024–25' పేరిట స్పోర్ట్స్ మీట్‌ను శనివారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశలోని స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించుకునేందుకు ఇష్టంతో కష్టపడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రూపారెడ్డి, కౌసిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ సులక్షణ, యామిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లాప్‌వాల్ మిషనరీతో వరద సమస్య పరిష్కారం




ఫ్లాప్‌వాల్ మిషనరీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఏ.పావనీవినయ్‌కుమార్, ఉన్నతాధికారులు

చిక్కడపల్లి: ఇళ్లలోకి వరద రాకుండా ఉండేందుకే ఫ్లాప్‌వాల్ మిషనరీని ఏర్పాటు చేశామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని స్ట్రీట్ నంబర్ 1,2 కాలనీలో అశోక్‌నగర్ నాలా వద్ద వరద రాకుండా నిర్మించిన చిన్న పైప్ వల్ల ఇబ్బందులు తలెత్తున్నాయని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులతో సమీక్షించిన తర్వాతే వరద రాకుండా ఉండేందుకు ఫ్లాప్‌వాల్ మిషనరీని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సిబ్బంది, కాలనీవాసులు పూర్ణచందర్, జీ వెంకట్‌రెడ్డి, ఎం.కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం 'సీఎంఆర్‌ఎఫ్'

చిక్కడపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. జవహర్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో 14 మంది లబ్ధిదారులకు శనివారం సాయంత్రం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, కడప సురేందర్, ఎస్‌డీ సాయికుమార్, మాధవ్, శ్యాంసుందర్, శ్రీనివాస్‌గుప్తా, చిట్టి, వల్లాల రవియాదవ్, రాజేశ్, గాంధీనగర్ కిరణ్‌కుమార్, టిల్లు, బాసం శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎస్సీ వర్గీకరణను ఏ శక్తులూ అడ్డుకోలేవు



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య

అంబర్‌పేట: ఎస్సీ వర్గీకరణను ఏ శక్తులూ అడ్డుకోలేవని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా బైక్ ర్యాలీలు, వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా అంబర్‌పేటలో జిల్లా ఇన్‌చార్జి గంట సుదర్శన్, భీమ్, రవికిరణ్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన బైక్ ర్యాలీని ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల గెల్వయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడి పాపయ్య మాట్లాడుతూ 30ఏళ్ల పోరాటాన్ని సుప్రీంకోర్టు గుర్తించి వర్గీకరణ న్యాయబద్ధమైన అంశమని తేల్చి చెప్పినప్పటికీ కొందరు మాల కులస్తులు సింహగర్జన పేరిట సభలు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం సానుకులంగా ఉండడంతో ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంచాల యాదగిరి, భాషపాక యాదగిరి, జీడీ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



జెండావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న గోవింద్ నరేశ్‌మాదిగ

మందకృష్ణ చొరవతోనే ఎస్సీ వర్గీకరణకు బీజం

ముషీరాబాద్: మందకృష్ణ చొరవతోనే ఎస్సీ వర్గీకరణకు బీజం పడిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్‌మాదిగ అన్నారు. రాంనగర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన ఎమ్మార్పీఎస్ జెండాను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. మందకృష్ణమాదిగ 30 ఏళ్లుగా చేసిన పోరాటం వల్లే ప్రధానమంత్రి ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు. మాదిగల కోసమే ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ అన్ని వర్గాల సంక్షేమానికి సైతం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గజ్జల రాజశేఖర్‌మాదిగ, గండి కృష్ణ, చిలుక ఎల్లయ్య, వినయ్‌రావు, ఎల్.నర్సింగ్‌రావు, సిద్ధంకి ప్రశాంత్, దశరథ్‌మాదిగ, ఇల్లెందుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత మృతికి సంతాపం

కాచిగూడ: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. బాలమల్లేశ్ గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర బాలమల్లేశ్ పార్థివ దేహం వద్ద నివాళులర్పించి, సంతాపం తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని వారు పేర్కొన్నారు.

దివ్యాంగుల హామీలను వెంటనే అమలు చేయాలి

కవాడిగూడ: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు విస్మరించడం సరికాదని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ భారతి అన్నారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. డీఎస్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కే వెంకటేశ్ గౌడ్‌తో కలిసి ఆమె హాజరై మాట్లాడారు. తెలంగాణలో 20 లక్షలకు పైగా దివ్యాంగులు ఉన్నారని చేయూత పథకం ద్వారా వారి పింఛన్‌ను రూ. 4016 నుంచి రూ. 6 వేలకు పెంచి వెంటనే పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రతి శాఖలో 5శాతం బడ్జెట్‌ను దివ్యాంగులకు కేటాయించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి కమిషనర్, డైరెక్టర్‌ను దివ్యాంగులకు చెందిన వారినే నియమించాలని డిమాండ్ చేశారు. మలక్‌పేట్, హైదరాబాద్ దివ్యాంగుల భవన్ ఆవరణలో బధిరులకు ప్రత్యేక డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసి హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. దివ్యాంగుల ఉద్యోగాలను క్యాలెండర్ పద్ధతిలో భర్తీ చేపట్టాలని అలాగే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేలా వెంటనే ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ మున్నా, దివ్యాంగుల సంఘం నేతలు గుత్తికొండ కిరణ్, గోపాల్, అందె రాంబాబు, కాళ్ల జంగయ్య, గొని యాదగిరి, మెరుగు శివ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా పార్కు చౌక్‌లో ధర్నా చేస్తున్న దివ్యాంగులు

అన్నదానం

చిక్కడపల్లి: చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయం సమీపంలో శనివారం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానంతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అన్నదాత పొద్దుటూరి నర్సింహారావు (మద్దుల మధురీదేవి జ్ఞాపకార్థం) సహదాత మద్దుల రామవెంకట సుబ్రహ్మణ్యం బ్రదర్స్ సహకారంతో అన్నదానం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేశ్, కోశాధికారి తొడుపునూరి రవి, మాజీ అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్తా, సంఘం సభ్యులు రాజేశ్వర్‌రావు, రాజురి బాలచందర్, సింగారపు శంకర్, సురేందర్ గుప్తా, ప్రసాద్, రాజయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు సముచిత స్థానం కల్పించాలి



ముషీరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షలకు పైగా ఉన్న పద్మశాలీ కులస్తులకు రాజకీయ, ఉద్యోగాల్లో జనాభా ప్రతిపాదికన సముచిత స్థానం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ పద్మశాలీలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం నుంచి రుణాలు అందేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్, కోశాధికారి బింగి నవీన్, రాజకీయ విభాగం అధ్యక్షుడు నగేశ్, సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు జయరాములు, నాయకులు సంపత్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

కాచిగూడ: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాచిగూడ ఏసీపీ రఘు కోరారు. సెంట్రల్ పీస్ కమిటీ సహాయ కార్యదర్శి ఎన్.శరత్‌శ్యామ్ నేతృత్వంలో ప్రతినిధులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆలయాలు, మసీదులు, చర్చిల వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



నేటి నుంచి ప్రజాపాలన ఉత్సవాలు

ముషీరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ముషీరాబాద్ నియోజకవర్గంలో డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజా పాలన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి జీఎన్.కేశవ్ తెలిపారు. ముషీరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నేతలు కన్నా డానియల్, రామకృష్ణ ముదిరాజ్, మహ్మద్ ఖదీర్ ఆలీ, అంజయ్యగౌడ్ తదితరులతో కలిసి మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, పేదల ఇండ్లకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్ల పెంపు వంటి అనేక హామీలను ఏడాదిలోనే అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వాటిని చూసి ఓర్వలేకే బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు చౌకబారు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జీఎన్.కేశవ్

జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌తో ఎంతో ఉపయోగం

హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి పళని కదిరవన్



చిక్కడపల్లి: ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ పాఠకులకు అందుబాటులో ఉండేందుకు జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్ ఎంతో ఉపయోగకరంగా మారిందని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ పళని కదిరవన్ పేర్కొన్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చిక్కడపల్లి నగర గ్రంథాలయ సంస్థ (సీసీఎల్)తో పాటు దీనికి అదనంగా 81 గ్రంథాలయ శాఖలు ఉన్నాయన్నారు. మొత్తం 105 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా వీరిలో 66 రెగ్యులర్, 39మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం అన్ని వసతులు కల్పించామని ఇందుకు నగర గ్రంథాలయ కార్యదర్శి పొట్లూరి పద్మజ చేసిన కృషి అభినందనీయమన్నారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఉద్యోగులు చురుగ్గా పనిచేసేందుకు వాట్సప్ గ్రూప్ కూడా ఏర్పాటు చేశామన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (50) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. అలాగే మరో ఘటనలో ఉప్పుగూడ–యాకుత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి (60) మృతి మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజల పక్షపాతి విద్యాభూషణ్

సంస్మరణ సభలో వక్తలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రజల పక్షపాతి విద్యాభూషణ్ అని రచయితగా, జర్నలిస్టుగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యాభూషణ్ పేరిట స్మారక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, నిజాయితీ నిబద్ధతతో పనిచేసినప్పుడే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి జీ ఝాన్సీ అధ్యక్షతన సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో శనివారం విద్యాభూషణ్ సంతాప సభ జరిగింది. సీనియర్ పాత్రికేయుడు, సంపాదకుడు టంకశాల అశోక్, సీనియర్ సంపాదకులు సతీశ్‌చందర్, వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు జూలూరి గౌరీ శంకర్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే గోవర్ధన్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. హన్మేష్, విద్యాభూషణ్ కుమారుడు ఆజాద్, కూతురు సంధ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2 నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టంకశాల అశోక్ మాట్లాడుతూ.. విద్యాభూషణ్ ప్రజల పక్షపాతిగా అనేక వార్తలు రాశారన్నారు. సతీశ్ చందర్ మాట్లాడుతూ.. నిబద్ధత, నిజాయితీ గల గొప్ప జర్నలిస్టు విద్యాభూషణ్ అని కొనియాడారు. జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ.. విద్యాభూషణ్ లాంటి వారు వేసిన మార్గాన్ని అనుసరించి నేటి తరం జర్నలిస్టులు ముందుకు సాగాలని సూచించారు.



విద్యాభూషణ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం